క్లుప్తంగా

వేడుకగా నాగదేవత విగ్రహాల ప్రతిష్ట



పేరుసోములలో ప్రతిష్ఠించిన విగ్రహాలు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల ఆంజనేయస్వామి ఆలయం పక్కన నాగదేవతల విగ్రహాలను ఆదివారం ప్రతిష్ఠించారు. పేరుసోముల విష్ణుకంటి క్షేత్రం ఉపాసకులు రామ్మోహన్ స్వామి విగ్రహాల ఏర్పాటుకు విరాళం ఇచ్చారు. అనంతరం నాగదేవతలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: రౌడీషీటర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడైనా దౌర్జన్యాలు, దందాలు కొనసాగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని.. సొంత నిర్ణయాలు తీసుకుని సమస్యలను కొని తెచ్చుకోవద్దన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రైనేజీ



ప్రమాదకరంగా ఉన్న రహదారి

బేతంచెర్ల: పట్టణంలోని పోస్టాఫీస్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన వీధిలో ఉన్న డ్రైనేజీ కాల్వ ప్రమాదకరంగా మారింది. గతంలో ఈ కాల్వపై బండలు వేసి తాత్కాలికంగా రహదారి ఏర్పాటుచేయగా, ఇప్పుడు అవి పగిలిపోవడంతో రహదారి కుంగిపోయింది. దీని వల్ల ప్రతిరోజూ పోస్టాఫీస్‌కు వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ కాల్వపై ఉన్న పాత బండలను తొలగించి, శాశ్వతంగా కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే ఎప్పుడైనా ప్రమాదం జరగొచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలతోనే మనుగడ సాధ్యం



వీరాంజనేయ కొండపై కోటిమొక్కల మహాయజ్ఞం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

డోన్: సహజసిద్ధమైన ప్రకృతి మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి కీలకమైందని గీతాయోగాసన సంఘం అధ్యక్షుడు రాంపుల్లయ్య అన్నారు. ఆదివారం స్థానిక వీరాంజనేయ కొండపై కోటిమొక్కల మహాయజ్ఞం అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కొండను దట్టమైన అటవీ ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఇప్పటి వరకు 20 వేల మొక్కలు నాటడం అభినందనీయం అన్నారు. అధికంగా ఆక్సిజన్ విడుదల చేసే వేప, రావి, సీతాఫలం, చింతచింకాయ వంటి మొక్కలు నాటినట్టు చెప్పారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను చింతల కృష్ణ స్వీకరించగా, రవాణా ఖర్చులను పీఎంఎస్ పిరమిడ్ ధ్యాన కేంద్రం భరిస్తుండటం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఉషాలత, రాజేశ్వరమ్మ, నాగరాజు, నందిపల్లె నారాయణ, రాధాకృష్ణ, ఆర్‌టీసీ శాంతి, మద్దమ్మ, ముడియాల శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ హాస్టల్ భవనాన్ని ప్రారంభించాలి

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో గత ప్రభుత్వ హయాంలో రూ.11 కోట్ల వ్యయంతో నిర్మించిన హాస్టల్ భవనాన్ని ప్రారంభించి గ్రామీణ విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శివన్న కోరారు. ఆదివారం మండల విద్యాధికారి కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. విద్యాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన పక్కా భవనాలు ప్రయోజనాన్ని కోల్పోకుండా తగిన విధంగా వినియోగించాలన్నారు. అంబేద్కర్ గురుకుల పాఠశాల అభివృద్ధికి, కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్ఎఫ్ నాయకులు వినోద్, రాజు, మనోజ్, మధు పాల్గొన్నారు.

మోసం చేయడం బాబు నైజం

- హామీల అమల్లో ప్రభుత్వం విఫలం
- పాలన కంటే అక్రమ కేసులకే కూటమి నేతల ప్రాధాన్యం
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధ్వజం
- మెట్టుపల్లె, కోనాపురంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' సమావేశం



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కరపత్రాలను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, స్థానిక మహిళలు



నెలలోనే చిరిగిపోయిన స్కూల్ బ్యాగును పరిశీలిస్తున్న కాటసాని

అవుకు: రాజకీయంలో 40 ఏళ్ల అనుభవం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబుకు మోసపూరిత రాజకీయం చేయడమే నైజమని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. అవుకు మండల పరిధిలోని మెట్టుపల్లె, కోనాపురం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమానికి కాటసాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల, మత, వర్గ, పార్టీ అనే తేడా లేకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిందని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి చూపించామని చెప్పారు. 2024 ఎన్నికల సమయంలో కూటమి నాయకులు సూపర్ సిక్స్ హామలంటూ ఊదరగొట్టి ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్నారని, తీరా గద్దెనెక్కి ఏడాది దాటినా ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేయకుండా సూపర్ సిక్స్‌ను కాస్త అంతా తుస్ చేశారని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా మహిళలు, రైతులు, విద్యార్థులకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మిర్చి రూ.280, వరి రూ.2,200, పొగాకు బేడెలు రూ.18000 పలికిందని, నేడు కూటమి ప్రభుత్వంలో మిర్చి రూ.80, వరి రూ.1200, పొగాకు బేడెలు రూ.4వేలు పలుకుతోందని.. రైతుల బాధ కూటమి ప్రభుత్వానికి పట్టదా అని నిలదీశారు. అప్పులు చేసి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక ఎంతోమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. విద్యా సంస్థల యాజమాన్యాలకు దాదాపు రూ.6వేల కోట్లు కూటమి ప్రభుత్వం బకాయి ఉందని, దీనివల్ల విద్యార్థులకు యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తే గాని సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారన్నారు. అలాగే మెట్టుపల్లె గ్రామంలో గత ప్రభుత్వంలో దాదాపు రూ.1.5 కోట్లకు పైగా నిధులు వెచ్చించి సీసీరోడ్లు, బీటీ రోడ్లు, సచివాలయం, ఆర్‌బీకే, పాఠశాలల అభివృద్ధి లాంటి ఎన్నో పనులు చేసామని గుర్తు చేశారు. డప్పులు కొట్టుకోవడానికి కూటమి నేతలు సుపరిపాలనకు తొలి అడుగంటూ గ్రామాల్లో తిరుగుతున్నారని.. సంక్షేమ పథకాలపై జనం ప్రశ్నిస్తుంటే ముఖం చాటేస్తున్నారన్నారు. పథకాలు, పాలనపై దృష్టి సారించకుండా ప్రశ్నించే వారిని టార్గెట్ చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, పబ్లిసిటీ వింగ్ రాష్ట్ర కార్యదర్శి రామన్న, నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం నాయకులు వాయునందనగౌడ్, వివిధ విభాగాల నాయకులు నర్సిరెడ్డి, మేకల వెంకటేశ్వర రెడ్డి, క్రిష్ణారెడ్డి, నారాయణ రెడ్డి, కొడితం జగదీష్, వెంకట రెడ్డి, వీరారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, వెంకట రామిరెడ్డి, పుష్పరాజు, మూరబోయిన మనోహర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాకొద్దీ ప్రభుత్వం

బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మెట్టుపల్లె గ్రామానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో గ్రామ మహిళలు, విద్యార్థులు వారి గోడును వెల్లబోసుకున్నారు. గత ప్రభుత్వంలో నాణ్యమైన బ్యాగులు, మధ్యాహ్న భోజనం అందేదని, కూటమి ప్రభుత్వంలో బ్యాగులు నెలలోపే చిరిగిపోయాయని, వాటిని వేసుకుని స్కూల్స్ వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని ఆ బ్యాగులను కాటసానికి చూపించారు. అలాగే మధ్యాహ్న భోజనంలో కూడా ఉడకని అన్నం, నాణ్యత లేని కోడిగుడ్లు, కుళ్లిపోయిన కూరగాయలతో ఉంటున్నాయని విద్యార్థులు వాపోయారు. అధికారులు ఇళ్లు నిర్మించుకోండి తర్వాత ప్రభుత్వం డబ్బులు ఇస్తుంది అని చెబుతున్నారని.. అంత స్థోమత ఉంటే ఇలా ఎందుకు ఉంటాం అని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. నూతన పింఛన్లు ఇవ్వడం లేదని పలువురు కాటసాని దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో ఏది కావాలన్నా వలంటీర్లు ఇంటి వద్ద వచ్చే చేసి వెళ్లేవారని.. ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు తమ సమస్యలను చెప్పుకున్నారు.

పరామర్శ



మద్దిలేటిని పరామర్శిస్తున్న కాటసాని

అవుకు: మండల పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన గుంతనాల మద్దిలేటి ప్రమాదవశాత్తు కిందపడడంతో వెన్నముకకు సర్జరీ జరిగింది. దీంతో మూడు నెలలుగా బాధితుడు మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం బాధితుని స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అధైర్య పడొద్దని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కమీషన్ల కోసం మంత్రి బీసీ కక్కుర్తి

బనగానపల్లె నియోజకవర్గంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రతి పనిలోనూ కమీషన్ల కోసం కక్కుర్తి పడి అక్రమ సంపాదకులకు అండగా నిలుస్తున్నారని కాటసాని రామిరెడ్డి విమర్శించారు. ప్రతి మండలంలోనూ తన అనుచరులు, స్థానిక నాయకులతో ఈ తతంగం సాగిస్తున్నారన్నారు. అక్రమార్జనే ప్రధాన లక్ష్యంగా కూటమి నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడ చూసినా పేకాట క్లబ్‌లు, మట్కా స్థావరాలు, గొలుసు దుకాణాలే దర్శనమిస్తున్నాయన్నారు. మంత్రి బీసీ అండతో కూటమి నాయకులు ఒక్క కోవెలకుంట్లలోనే 5 పేకాట స్థావరాలను ఏర్పాటు చేసారంటే నియోజకవర్గంలో ఏ స్థాయిలో జరుగుతుందో ప్రజలకు అర్థమవుతోందన్నారు. పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు.

రక్తదాతలే నిజమైన మానవతావాదులు



దాతలను అభినందిస్తున్న సీఐ

డోన్‌టౌన్: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడే వారు నిజమైన మహోన్నతులు అని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆరోగ్య మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిలో తలసేమియా బాధితుల కోసం స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా రక్తదాతలకు ప్రోత్సాహక సరిఫికెట్లు అందజేశారు. శిబిరంలో సీసంగుంతల గ్రామానికి చెందిన దివ్యాంగుడు ధనుంజయ్ యాదవ్, విజ్ఞాన్ స్కూల్ టీచర్ మంజుల రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. మొత్తం 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు మధు, గోవిందరెడ్డి, భాస్కర్, మోహన్‌గౌడ్, చింతలయ్య పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి స్పందన

వైద్యం కోసం తరలివచ్చిన జనం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి శిబిరాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 1400 మందికి గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, కంటి, చర్మం, కిడ్నీ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి, మౌలాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు భద్రత కరువు



ప్రహరీ లేని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల

డోన్: పట్టణ శివారులోని ఉడుములపాడు వద్ద ఉన్న కోట్ల విజయభాస్కర్‌రెడ్డి అవుట్‌డోర్ స్టేడియం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పందులు, విషసర్పాలు తిరుగుతూ విద్యార్థులకు భయానక వాతావరణం ఏర్పడుతోంది. ఈ స్టేడియంలో గత ఏడాది నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగినప్పటికీ సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. స్టేడియంలో కేవలం ఒక షెడ్డు, రెండు గదులు మాత్రమే ఉండడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులు చాలక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో పందులు, సర్పాల బెడదతో భయభ్రాంతులకు లోనవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాల కోసం యూ.కొత్తపల్లె వద్ద స్థలం మంజూరైంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధుల కొరతను కారణంగా చూపుతూ నూతన భవన నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ అవుట్‌డోర్ స్టేడియానికి తగిన విధంగా ప్రహరీ గోడ నిర్మించి, పాఠశాల విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

మహిళల రక్షణకు కఠిన చట్టాలు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: మహిళల రక్షణకు కఠినమైన చట్టాలు అమలవుతున్నాయని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని బీసీ బాలికల కళాశాల హాస్టల్‌లో శక్తిటీం ఆధ్వర్యంలో వివిధ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 112, పోక్సో యాక్ట్, సైబర్ నేరాలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 1930 గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మహిళలు, మైనర్ బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తించినా పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. శక్తిటీం ఏఎస్ఐ నాగరాజు, హాస్టల్ వార్డన్ విజయలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ శంకరమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న రామాంజనేయులు

డోన్‌టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నేతలు విస్మరించారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు విమర్శించారు. ఆదివారం పట్టణంలోని తారకరామనగర్‌లో జరిగిన పార్టీ శాఖ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తారకరామనగర్ సర్కిల్‌లో పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్ల స్థలం, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఇస్తామన్న హామీ కేవలం మాటలకే పరిమితమైందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తుండగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలుపై నోరు విప్పడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించేందుకు సీపీఐ ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. డోన్‌లో ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న పార్టీ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు మోటా రాముడు, నారాయణ, నాయకులు రణత్ యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారుజామున 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉంటుందని పేర్కొన్నారు.

- సంజామల: మండలంలో వ్యవసాయానికి సోమవారం నుంచి ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లయ్య

డోన్‌టౌన్: గృహ వినియోగదారులపై భారం మోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా సీనియర్ నాయకుడు ఎల్లయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విపక్షంలో ఉన్నప్పుడు యువగళం పాదయాత్రలో లోకేష్ స్మార్ట్ మీటర్లను పగులగొట్టండి నేనే చూస్తాను అన్నారని కానీ అధికారంలోకి వచ్చాక వాటి అమలుకు శ్రీకారం చుట్టడం దుర్మార్గం అని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. స్మార్ట్ మీటర్లతో వినియోగదారులపై ఆర్థిక భారం పెరుగుతుందని, దీనిపై విస్తృత ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు శివరామ్, రామాంజనేయులు, నాగమద్దయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాసంప్రోక్షణ మహోత్సవాలు ప్రారంభం





గరుత్మంతుడు, కలశాలను గ్రామోత్సవం చేస్తున్న భక్తులు, పూజలు చేస్తున్న వేదపండితులు

కొలిమిగుండ్ల: శ్రీకృష్ణదేవరాయల పరిపాలన కాలంలో కొలిమిగుండ్ల కొండపై నిర్మించిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ మహా సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో రూ.7కోట్లతో జీర్ణోద్ధరణ చేపట్టిన విషయం తెలిసిందే. నాలుగు రోజుల పాటు నిర్వహించే మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం నూతన గరుత్మంతుడు విగ్రహం, కలశాలను తేరు మిద్దె నుంచి మేళతాళాలతో గ్రామ పెద్దలు, ఉభయదారులు, భక్తుల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అంతకు ముందు అన్ని ఆలయాల్లో టెంకాయలు సమర్పించారు. సాయంత్రం 6 గంటల తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఆగమ పండితుల బృందం ఆధ్వర్యంలో శ్రీవిష్ణుసహస్ర నామ పారాయణం, ఆచార్య అమజ్ఞ, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురారోపణం, హోమం తదితర విశేష పూజలు చేశారు. రామ్‌కో యూనిట్‌హెడ్ మీనాక్షి సుందరం, ప్రెసిడెంట్ రామరాజు కుటుంబ సభ్యులతో కలిసి అంకురార్పణ పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని రామ్‌కో యాజమాన్యం ఆలయాన్ని బెంగళూరు నుంచి తెప్పించిన పూలతో అందంగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో నూతన శోభను సంతరించుకుంది.

విద్యార్థికి ఆర్థిక సాయం



సహాయాన్ని అందజేస్తున్న దాత

డోన్ టౌన్: పట్టణానికి చెందిన కొమ్ము చంద్రశేఖర్ ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగభూషణంరెడ్డి, శైలజ దంపతుల కుమార్తె జాహ్నవి తన పాకెట్ మనీ రూ.5వేలను ఆదివారం స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యాలయంలో అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు శకుంతల, కార్యదర్శి విజయలక్ష్మి, విద్యార్థి తల్లి లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుదాం

బనగానపల్లె రూరల్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి శివయ్య ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో డోన్ పట్టణంలో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీల అమలు, రైతులకు సంబంధించిన ప్రాజెక్టులు, యువతకు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాల కల్పన, నాపరాయి పరిశ్రమ, టూరిజం అభివృద్ధి వంటి అంశాలపై చర్చ జరగనుందన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


డోన్ టౌన్: పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో 2016–17 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రిటైర్డు హెచ్‌ఎం రామచంద్రుడు, టీచర్లు దేవేంద్ర, అన్వర్‌బాషా, ప్రసాద్, అంజనప్ప, నాగలక్ష్మీ, సురేష్‌గౌడ్, సుధాకర్, సుబ్రమణ్యంలను సత్కరించారు. పూర్వ విద్యార్థులు మౌలాబీ, రఫీ, అలీ, రాజు, శ్రీదేవి, ఇందు తదితరులు పాల్గొన్నారు.



పాతపేట జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ట్రాన్స్‌కో ఏఈ కావలెను

- ఏడు నెలలుగా పోస్టు ఖాళీ
- లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టు సైతం
- పనుల్లో జాప్యం
- విద్యుత్ వినియోగదారులకు ఇక్కట్లు



కొలిమిగుండ్ల ట్రాన్స్‌కో కార్యాలయం

కొలిమిగుండ్ల: విద్యుత్ శాఖలో రెండు ప్రధానమైన పోస్టులు నెలల తరబడి ఖాళీగా ఉండడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొలిమిగుండ్లలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ), లైన్‌ఇన్‌స్పెక్టర్లు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఇక్కడికి వచ్చేందుకు ఎవరూ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో ఏఈ పోస్టు ఏడు నెలలు, లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఏడాది నుంచి ఖాళీగా ఉంది. వినియోగదారులు ఏదో ఒక సమస్యపై కార్యాలయానికి వచ్చినా ఇద్దరు ముఖ్యమైన అధికారులు లేక పనులు సకాలంలో జరగడం లేదు. మండలంలో 12,619 గృహాల కనెక్షన్‌లు, 792 కేటగిరి–2, పరిశ్రమలు 521, వాటర్ వర్క్స్, ప్రభుత్వ కార్యాలయాలు 406, అగ్రికల్చర్ 2419 కనెక్షన్‌లు ఉన్నాయి. మొత్తంగా అన్ని రకాల కేటగిరీలు కలిపి 16,643 ఉన్నాయి. ప్రతి నెలా విద్యుత్ బిల్లుల రూపంలో రూ.1.80 కోట్లు వసూలు చేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో బిల్లుల వసూలులో జాప్యం చోటు చేసుకోవడంతో కింది స్థాయి సిబ్బందిపై భారం పడుతోంది. ఇద్దరు అధికారులు లేకపోవడంతో కోవెలకుంట్ల డివిజన్ స్థాయి అధికారి ఏడీ రెండు, మూడు రోజులకోసారి కొలిమిగుండ్లకు వస్తుంటారు. ఏఈ తర్వాత లైన్‌ఇన్‌స్పెక్టర్ పాత్ర కీలకం. ప్రతి నెలా పాలిష్ ఫ్యాక్టరీలతో పాటు ఇతర పరిశ్రమలు, వాటర్ వర్క్‌లు, వీధిలైట్లు, సబ్‌స్టేషన్లలో రీడింగ్ తీయాల్సి ఉంటుంది. కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, చింతలాయిపల్లె, తిమ్మనాయినపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి. ఈ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సమస్యలు ఏర్పడుతుంటాయి. ఇద్దరు అధికారులు లేకపోవడంతో వినియోగదారులకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. ఏదైనా అత్యవసరమైతే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. కొలిమిగుండ్ల మండలంలో ఆదాయ వనరులు ఉండటంతో గతంలో ఇక్కడికి ఏఈ, లైన్‌ఇన్‌స్పెక్టర్లు పోటీ పడుతుండేవారు. ప్రస్తుతం ఏ కారణం వల్ల అధికారులు ఇక్కడికి వచ్చేందుకు ఇష్టపడటం లేదో అంతుచిక్కడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మండలంలో విద్యుత్ కనెక్షన్ వివరాలు

గృహాలు	-12,619
కేటగిరి-2	-792
పరిశ్రమలు	-521
వాటర్ వర్క్స్, ప్రభుత్వ కార్యాలయాలు	-406
అగ్రికల్చర్	-2419
విద్యుత్ సబ్‌స్టేషన్లు	-05